# వెలి పెడితే అల్లుడైనాడు

ఆషాఢమాసము. ఆకస మంతయు మేఘావృతమై యుండెను. ఎప్పుడును వర్షభయము విడుచుట లేదు. జడివాన కాకున్న గోదావరి జల్లు అదియు గాకున్న ఎలగోలుజల్లు. తఱుచు ముసుళ్ళు. తెల్లని బట్టలు కట్టుకొని కూర్చుండువారికి ఇల్లువిడుచుటకు అసందర్భముగా నుండెను. ఊడ్పుల తొందరలో నున్న రయితులు మాత్రము ఈ వానలకు జడియలేదు. ఒక్కొక్కపుడు తాటియాకు గొడుగులును, గూడచాపలునుగూడ విడిచి వారు వర్షమునందే పనిచేయుచుండిరి. క్షణము దాటిన పంట లేతయైపోవును. వ్యవసాయము విడిచి రయితు చేయవలసినదేమున్నది?

పున్నమి వెడలిపోయినది. రయితుల కందఱకును చాల తొందరగా నుండెను. కురవక కురవక వాన దిమ్మరింపసాగెను. గోదావరి యుప్పొంగెను. కాల్వలలో నీరు గట్టుమీది నుండి పొర్లిపోవుచుండెను. ఒక్కొక్క చేనిలోనికి దారి చేయకుండనే నీరు ప్రవహించుచుండెను. రయితుల కందఱకును ఒక్కమాటే తొందరకలిగెను. కూలి పెరిగిపోయినది. అయినను మనుష్యులు దొరకుట కష్టముగా నుండెను. పాటకపు స్త్రీలు పెండ్లికాని తమ కొమార్తలను గూడ ఊడ్పులకు తీసికొనిపోవుచుండిరి. ముందు కష్టమో, సుఖమో ఇప్పుడు తలకు దినమునకు రెండు కుంచముల యాదాయము. బీదలు విడువగలరా?

మేఘాడంబరమువలన సాయంకాలమువలె తోచుచుండెను. ముసురు. ఈదురుగాలి. అప్పుడే తొమ్మిది గంటలయినది. మాలపల్లెయందలి స్త్రీలందఱును తమ పిల్లలతో వచ్చి దోనె యెక్కిరి. ఒకరును వెనుదీయలేదు. అందఱకును భయముగనే యుండెను. వెనుకవచ్చుచున్న కాపులు "కలగతొక్కుకోకండి" అని మందలించుచుండగా దోనె కదలినది. దోనెవాడు దోనెను చాల కష్టముతో నడుపుచుండెను. కాల్వ నడుమకు వచ్చునప్పటికి దోనె కదలసాగెను. ఒక నిమిషమిట్లు జరిగినది. రెండవనిముసములో అదితల్లక్రిందులయ్యెను. హృదయవిదారకమగు ఆక్రందనధ్వని ఆకాశమును చిల్లులు పఱచెను. కాల్వ అంతయు మునిగి తేలుచున్న స్త్రీలతోడను, బాలికలతోడను నిండిపోయెను.

తీరముననున్న రయితులు కొందఱు భ్రాన్పడిరి. ఒకరిద్దఱు రక్షణము నిమిత్తము నీటిలో నుఱికిరి. వారితో పాటు పావంచాల రేవులో స్నానము చేయుచున్న విశ్వనాధశాస్త్రిగూడ ఉఱికెను; గాని యేమి ప్రయోజనము? అగ్నిహోత్రమునడిమి చీమలదండు. స్వయముగ తంటాలుపడిన స్త్రీలు ఏడెనమండుగురు ఒడ్డు చేరిరి. విశ్వనాధశాస్త్రియు రయితులును మఱి పదిమందిని రక్షించిరి. చచ్చిపోయిన స్త్రీల సంఖ్యయే యధికముగ నుండెను.

సీతారామయ్యనాయుడు శరవేగమున అక్కడకు వచ్చునప్పటికి విశ్వనాధశాస్త్రి అతికష్టముమీద పదునెనిమిదేండ్ల యువతిని ఒడ్డునకు జేర్చెను; గాని వెంటనే ఆయాసము వలన కదలలేక పడిపోయెను.

నాయడు అంతయు చూచెను. "పెళ్ళికూతుర్ని రక్షించావు. బ్రాహ్మడా, దేవుడు నిన్ను రక్షిస్తాడు" అని చెప్పుచు నాయడు విశ్వనాధశాస్త్రిని తేర్చెను.

ఆ యువతి నాయని పెద్దపాలికాపు భార్య. అమె వివాహము అయి పదునైదు దినములు మాత్రమయ్యెను. ఆ పెండ్లి నాయడే చేయించెను. అమె యొడలిమీది పసుపు నిగ్గు లింకను తొలగిపోలేదు.

ఉత్తరక్షణమున ఊరంతయు అక్కడకు వచ్చెను. అసంఘమరణమును జూచి కంటదడిపెట్టిన వారందఱును రయితులను శాస్త్రిని ప్రశంసించిరి.

## ②

దూరమున నిలిచి బ్రాహ్మణులు అంతయు వినిరి. "విస్సన్నా! మాలాళ్ళని ముట్టుకున్నాడు. కులంలో చేర్చుకోవడానికి వీలులేదు. జాగర్త." అని గొంతెత్తి పలికి పద్మనాభశాస్త్రి వెడలిపోయెను. ఆతని వెనుకనే తక్కిన బ్రాహ్మణులందఱును వెడలిపోయిరి. ఒక్కరును శాస్త్రిని సమీపించలేదు.

నాయడంతయు విని శాస్త్రిదెసకు చూడగా "పోనియ్యండి. మనుష్యుల ఆగ్రహానుగ్రహములు ఎంతటివీ? నేను చేసిన పని వలన ఈశ్వరుడు సంతోషిస్తే చాలు" అని శాస్త్రి బదులు చెప్పెను. ఎవరు నేమియు ననకపూర్వమే నాయడు శాస్త్రిని తన యింటికి తీసికొని వెళ్ళెను. ఈసంగతి విని శాస్త్రియే యింట బసచేసి యుండెనో ఆయింట నున్న శాస్త్రి బట్టలు మున్నగువానిని పద్మనాభశాస్త్రి యాజ్ఞచొప్పున ఇంటివారు నాయనియింటికి పంపివేసిరి.

"ఇక్కడ వుంటే యింక యేమి ప్రయోజనమూ? సెలవివ్వండి. దేశానికి వెళ్ళిపోతాను" అని శాస్త్రి యడుగగా నాయడు వల్లగాదనియెను. "మీకేమీ భయం లేదు. లోటు లేదు. జడవకండి. నేనుండగా రుద్రుడుగూడ మీకు అపకారం చేయలేడు" అని యాతడాతనికి ధైర్యము చెప్పి తన గాదెలదొడ్డిలోని సావడిలో వండుకొని తినుచు ఉండుటకు అంతయు ఏర్పఱిచెను. శాస్త్రికి బ్రాహ్మణ సంపర్కము లేదు. ఇంతే లోటు.

## ③

చింతపల్లిలో విద్వాంసులు చాలమంది యుండెడివారు. తర్కశాస్త్రమునకు, అలంకారశాస్త్రమునకు అది పీఠము అని ప్రఖ్యాతి పొందెను. ఇప్పటికిని ఆఖ్యాతి దానికి గలదు. అయితే పాండిత్యము మాత్రము తక్కువ. కలతగొట్టు విద్వాంసులనేకులు కలరు. వారికందఱకును పద్మనాభశాస్త్రి నాయకుడు.

విశ్వనాథము మూడేండ్లక్రిందట పేరువిని విద్య పూర్తిచేసికొనుటకు అక్కడకు వచ్చెను. ప్రారంభమున అతని కచ్చుట ప్రవేశము గలుగుటయే కష్టమయ్యెను. అందులకు ముఖ్యకారణము శాఖాభేదము. బ్రాహ్మణులలో నేశాఖయందైన - ఇతరశాఖలతో వ్యవహారము వచ్చినపుడైన కొంచెము ఐకమత్యము ఉన్నచో అది పద్మనాభశాస్త్రి శాఖయందే. విశ్వనాథము వారికి సంబంధములేని శాఖలోని వాడు.

విద్యయే ప్రధానమనుకొని యాతడు ఎట్లో అక్కడ స్థానము సంపాదించెను. అతడు చాల చురుకైనవాడు. నిశితప్రతిభయు, మొక్కవోని ధైర్యమును, తఱుగని పట్టుదలయు ఆతనిని కృతార్థుని గావించినవి. రెండేండ్లలో నాతడు ఆగ్రామమునందలి పండితుల కందఱకును పైవాడయ్యెను. నమ్మిన గురువు ఆరుమాసములక్రిందట చనిపోయెను. అయిన నాతని కాగ్రామమున నుండిపోవుట కొక కారణము తటస్థించెను.

విశ్వనాథశాస్త్రి మంచి సాహిత్యగాడు అనుటకంటె మంచి పౌరాణికుడు అనిన మంచిది. భారతభాగవతరామాయణములు అతడు చాలవిమర్శతో చూచెను. చక్కని కంఠము. మనోమోహనమైన రాగాలాపముగూడ గలదు. పైగా స్ఫురద్రూపము. విశాలలాటమున విభూతిదాల్చి కూర్చుండిన ఈశ్వరుడు అని తలంచునంత తేజస్వి.

గ్రామస్థుల బాలు రిద్దరో ముగ్గురో ఆతనివద్ద పాఠములు చెప్పుకొనుచుండిరి. వారికి ఆతనిని విడుచుట కిష్టము లేకుండెను. ఇది ఆతడక్కడ ఉండిపోవుటకు బ్రాహ్మణులెఱిగిన కారణము. ముఖ్యకారణము రహస్యముగా నున్నది.

సీతారామయ్య నాయుడు చాల సంపన్నుడు. శాస్త్రి వయస్సే. చురుకైనవాడు. సాహసికుడు. లోభికాడు. వితరణశాలి. ఆతని తల్లికి పురాణశ్రవణమున చాల ప్రీతి. "వార్ధక్యం వచ్చింది. ఆవిడ కోరికలు సాగనియ్యాలి" అని నాయుడు భార్యతో చెప్పెను. "భారతమూ, భాగవతమూ, రామాయణమూ అయిందాకా మీరు ఈ వూరు విడవడానికి వల్లకాదు" అని ఆ వృద్ధస్త్రీ చెప్పగా మంచి సత్కారము కలుగునని యాశించి శాస్త్రి అక్కడ నుండిపోయెను. ఈ కారణము నాయుడు ఆతని తల్లి శాస్త్రి - ఈ ముగ్గురును తక్క ఇతరు లెఱుగరు.

శాస్త్రి గురువు చనిపోయిన పదిదినములకు నాయని తండ్రి చనిపోయెను. తండ్రి యౌర్ధ్వదేహిక క్రియలు చేసినప్పుడు నాయుడు సకలదానములతోబాటు కన్యాదానము గూడ తలపెట్టెను. దానినిమిత్తమును, భూదానము నిమిత్తమును గ్రామవాసులు చాల ఆశించిరి. రెండును పైవారికి పోయెను. భూదానము వైద్యునకు ముట్టెను. "కన్యాదానం అయినా వూళ్ళో ముట్టచెప్పు" అని పద్మనాభశాస్త్రి చాల దూరము చెప్పెను. "తల్లీదండ్రీ కూడా లేదు. బీదవాడు. యోగ్యుడు వీడికి

ఇయ్యి" అని తన బావమఱది కొడుకును ముందునకు లాగి చూపెను; గాని ప్రయోజనము కలుగలేదు. నాయుడు మంచిచెడ్డ లెఱింగినవాడు. "దానానికి పాత్రత ప్రధానం గాని ఊరున్నూ, బంధుత్వమున్నూ కావు" అని చెప్పి యాతడు ఆదానమును విశ్వనాథశాస్త్రికిచ్చి "పిల్లని చూసుకోండి. పెళ్ళికి వేయున్నూటపదహారులు ఇస్తాను" అని చెప్పెను. పొరుగూరి వారు ఆనందించిరి. ఊరిలోనివారు ధుమధుమలాడిరి. పద్మనాభశాస్త్రి ఇచ్చిన నాయని, పుచ్చుకొనిన శాస్త్రిని తూలనాడెను. నాయుడు సీమ మిరపకాయ వంటివాడు. మాట పడడు. "నాయెదట నుంచిపో" అని యాతడు సింహగర్జనము చేసెను.

## 4

"జిల్లాలుకూడా దాటిపోయిందిరా. ఎక్కడి గుంటూరూ? ఎక్కడి గోదావరీ? కులం తక్కువవాడో, గుణం తక్కువవాడో తెలవకుండా దానం చేస్తాడా నాయడూ? మొగంనిండా వీభూది పెట్టి పద్యాలు రాగవరసతో పాడితేనే వచ్చిందా పాత్రత్వం? వూళ్ళోవాళ్ళకి నిజంగా గొప్ప అవమానం జరిగిందిరా" అని పద్మనాభశాస్త్రి తన్ను నమ్మిన పొరుగింటి బ్రాహ్మణ యువకునితో చెప్పుచు వెడలిపోయెను. "గ్రామస్థులు ఆశించి వున్నారు. కొన్ని కారణాలచేత పద్మనాభశాస్త్రులుగారు యిదివరకే నామీద కొంచెం అనుగ్రహం తప్పి వున్నారు. ఇది పుచ్చుకుంటే నన్నేమయినా –" అని విశ్వనాథశాస్త్రి సందేహింపగా "నాకిన్ని తెలవవు. పుచ్చుకుంటే మీకిస్తాను. లేకుంటే అసలే మానేస్తాను" అని నాయుడు ఖచ్చితముగా చెప్పెను. అట్టి విచారసమయమునగూడ నాయని తల్లి శాస్త్రిని రహస్యమునకు పిలిపించి "పుచ్చుకోండి. నేనిమ్మన్నాను మీకు" అని చెప్పెను. చేయునది లేకయు, వేయున్నూటపదార్లు విడువలేకయు తుదకు శాస్త్రి కన్యాదానము పట్టెను.

శాస్త్రిగురువు బ్రతికియుండగా నొక వివాహసదస్యమున ఒక తగవు వచ్చెను. విశ్వనాథశాస్త్రి యొక్కడే; గాని ప్రతివాదులు పదుగురు ఉండిరి. వారందఱికిని వ్యాఘ్రముఖుడును, తీవ్రభాషియునగు పద్మనాభశాస్త్రి నాయకుడైయుండెను. శాఖాభిమానమువలన పద్మనాభశాస్త్రిదితప్పని చెప్పలేకయు పేరు నిలుపు శిష్యుడు అను అభిమానము వలన శాస్త్రిది తప్పని చెప్పలేకయు గురువు తప్పించుకొని వెడలిపోయెను. మేజువాణీ జరుగుచుండెను. ప్రఖ్యాతి పొందిన నాయకురాలు మనుచరిత్రమునందలి వరూధినీ ప్రవరుల సంభాషణ పద్యములను చదివి అభినయించుచుండెను. "ఏకత్రైవానురక్తి శ్చే"త్తను న్యాయముననుసరించి రసాభావదోషము తగిలినదా లేదా యని ప్రక్కనున్న హంగుదారుని కనుసంజ్ఞమీద నాయకురాలు ప్రశ్నింపగా వాదము పొసగినది. వెంటనే విశ్వనాథశాస్త్రి అందుకొనియెను. "ముందు వీడందుకోవడం యేమిటీ" అను ఈర్ష్య యొకటి – "మనం ఊరుకోవడం ఏమిటీ" అను అహమికమొకటి –

పెండ్లివారు తన విద్వత్తును దెలిసికొని భూరిసంభావన ఈయవలయునను ఆశయొకటి - ఈ మూడు కారణముల వలనను పద్మనాభశాస్త్రి ప్రతివాదము ప్రారంభించెను. ఉన్నతకాయము, వ్యాఘ్రముఖము, సింహగర్జనములు గల పద్మనాభశాస్త్రి యౌద్ధత్యమునకు సుకుమారియగు నాయకురాలు బెదరి, తనమార్గమునకే వచ్చుచున్న విశ్వనాథశాస్త్రి - స్ఫురద్రూపి - కిన్నెరకంఠుడునగు యువకుడు ఓడిపోవునేమోయని బెంగటిల్లెను. రెండుగంటలు తీవ్రవాదము జరిగెను. పద్మనాభశాస్త్రి వాదమున పెద్దకేకలు తప్ప రసము లేదని సభ నిశ్చయించుకొనియెను. నాయకురాలును, విశ్వనాథశాస్త్రియు ప్రతిపక్షులు విషయదూరులగుచున్నారని తెలిసికొని యౌదాసీన్యము ప్రకటించిరి. దీనితో పద్మనాభశాస్త్రికి చాలకోపము వచ్చెను. నిండుసభలో - వారకాంతల యెదుట - ఒక వారకాంత తోడను, ఒక అన్యశాఖ యువకునితోడను పొసగిన వాదమున ఓటమి సంభవించినందులకు - పరాభవము కలిగినందులకు చాల కష్టము తోచెను. నిజముగా ప్రాణము చచ్చిపోయెను.

పద్మనాభశాస్త్రి కలతను పెంచుకొన్నాడు. విశ్వనాథశాస్త్రి మీద పగబట్టినాడు. నాయని యింటిలోని పరాభవము ఆ కసిని పెంచినది. చాలు. అంతయు పూర్తియైనది. "విన్నన్నా? మాలాళ్ళని ముట్టుకున్నాడు. కులంలో చేర్చికోవడానికి వీలులేదు" అని శాస్త్రిని వెలివేసినాడు.

విశ్వనాథశాస్త్రి గుంటూరు నుండి వచ్చెను. ఆతనికొక వృద్ధమాతమాత్రముండెను. చాలబీదవాడు. ఆమెను తన మేనమామయింట నుంచి యాతడిక్కడ చదువుకొనుచు - భవిష్యల్లోకయాత్రకు పునాదులు వేసికొనుచు ఉండెను.

## 5

"మనకి పరాభవం చెయ్యాలని నాయడు ఈప్రాంతపు పిల్లనే చూసుకోమని నిర్బంధిస్తున్నాడుట. వొరేయి! మనం జాగర్తగా వుండాలి" అని పద్మనాభశాస్త్రి చెప్పగా గ్రామస్థులందఱును అంగీకరించిరి. వెలివచ్చిన తరువాత శిష్యులు శాస్త్రిని విడిచిపెట్టిరి. "మీనిశితబుద్ధికి అందం వస్తుంది. సంస్కృతం చదువుకోండి" అని ప్రోత్సహించి శాస్త్రి నాయనికి విద్య నేర్పదొడగెను.

దినములు గడచిపోవుచుండగా నాయనిబంధువొకడు వితంతువివాహము చేసికొనియెనని వార్త వచ్చెను. "శాస్త్రాలేమేనా వప్పుకుంటాయిటండీ శాస్త్రులుగారూ" అని నాయని తల్లి కదుపగా శాస్త్రికిని నాయనికి వాదము పొసగెను. నాయడు వీరేశలింగము పంతులుగారు లేని లోపము తీర్పగా "కాలం మారిపోయింది. పూర్వధర్మాలే నిలవాలంటే కష్టం. శాస్త్రాల సంగతి యెలావున్నా ఇప్పటి బాలవితంతువుల స్థితి చూస్తే జాలి కలుగకమానదు. వీరేశలింగంగారి మనస్సు

చాలా మెత్తనిదని తోస్తూ వుంది. అంచేతనే ఆయన ఈయాచారాన్ని ప్రారంభించడానికి సాహసించి వుంటారు" అని శాస్త్రి తుదకు చెప్పెను. "పురుషులలోకంటె స్త్రీలలో శీలనైశిత్యం అధికంగా వుంది. స్త్రీలు మళ్ళీ వివాహం చేసుకోకుండా వుంటేనే గొప్ప వున్నది. అయినా కాలం మారినది. యిప్పటి బాలవితంతువులకు అనేక కారణాలచేత పునర్వివాహం మంచి దైతే కావచ్చును" అని వృద్ధురాలు చెప్పగా ఆమె యూహకు శాస్త్రియు నాయడునుగూడ మ్రాన్పడిరి.

కాలక్రమమున పౌరాణికుడైన శాస్త్రి ప్రఖ్యాతి గ్రామమునందలి వారేగాక చుట్టుప్రక్కలన్ను నాయని బంధువులుగూడ విని తఱుచు వచ్చి పురాణము విని పోవుచుండిరి. పద్మనాభశాస్త్రి పలుకుబడి గలయంతవఱకును బ్రాహ్మణులు ఆతని దెస చూచుటయు మానివేసిరి. తక్కినవారయిన ఎక్కడనైన కాన్పించిన ఓహో యనుట తప్ప వేఱు విధము లేకుండెను. స్వయముగా వంటచేసికొనవలసిన యవసరముగూడ ప్రబలమై యుండెను. తల్లినిదీసితెచ్చికొందమన్న ఇక్కడ స్థిరమన్న మాట యేమిటి? ఉండిపోదమన్న వెలివేయబడిన స్థితిలో నేమి సుఖము? శాస్త్రి యిది యంతయు యోచించుకొనుచు సదాలోచనములుతోచక కొట్టుకొనుచుండెను.

స్వయంపాకబాధ తప్ప అతనికి భోజనవిషయమున ఏలోపమును గలుగుట లేదు. "వారికి లోపాలు వస్తే వప్పను" అని నాయడు ఖచ్చితముగా జెప్పి యుండెను. నాయని తల్లి పైగా పర్యవేక్షణముగావించుచుండెను. నాయని భార్య "అన్నయ్యగారి కేంగావాలో చూచిరావే" యని దాసిని ఎప్పటికప్పుడు పంపుచుండెను. జమీందారీ భోజనము జరుగుచుండెను.

పురుడు పోసికొనుటకు నాయని భార్య కాకినాడ పుట్టినింటికి అరిగియుండెను. ఆమెను విడిచి యుండలేని నాయడు చూచివచ్చెదనని వెళ్ళి యింకను రాలేదు. ఇంతలో "ప్రసవసమయం. నేడో రేపో పురుడు వస్తుంది" అని కబురు రాగా నాయని తల్లిగూడ కాకినాడ వెళ్ళెను. శాస్త్రి ఒంటరిగాడయ్యెను. నాయడు కాకినాడ వెళ్ళి నాలుగుదినములగుట, పురాణపఠనము లేకుండుట, శాస్త్రికి చాల ఇబ్బందిగా నుండెను.

## ⑥

ఫాల్గున బహుళము. ఎండలకు తారుణ్యము పొడచూపినది. చలి తగ్గిపోయినది. సాయంకాలము ఆఱుగంటలవేళ – సూర్యాస్తమయము కానుండగా ఆతడు గాదెల సావడి అరుగుమీద రెడ్డికము వేసికొని కూర్చుండి యేమో యాలోచించుచుండెను. ఆసమయమున నొక బాలవితంతువు – ఇరువది యేండ్లుండవచ్చును. చామనచాయయే గాని అందగత్తె ఆమార్గమున కాల్వదెసకు అరుగుచు శాస్త్రిమీద దీర్ఘకటాక్షమాలికను విసరెను.

"ఏమిటిదీ? కాలవకి వెడుతూవున్న నరసమ్మకీవికారం యేమిటీ?" అని శాస్త్రి తర్కించుకొనెను; గాని పర్యవసానము తేలలేదు. "నెల్లాళ్ళనుంచి ఓరచూపులు వచ్చాయి. కోపమా? మఱి యొకటా? కోపానికి కారణం అందరికీ తెలిసే వుంది. మఱియొకటయితే - అలా అవుతుందా?" అని యాతడింక ననేకవిధముల తర్కించుకొనియెను; గాని యేమియు తోచలేదు. "మళ్ళీ రానియ్యి" అని యాతడు గంటవేళ యైనను అక్కడనే కనిపెట్టుకొనియుండెను.

చీకట్లు పడెను. రేవులో నరసమ్మ మాటలు వినబడెను. "నుంచుంటాను. వస్తావా?" అని యెవరో యడుగగా "బట్ట మయిలపడింది. నీళ్ళు పోసుకు వస్తాను. ఆలస్యం అవుతుంది. నువ్వు పద" అనియామె చెప్పిన ప్రత్యుత్తరము అక్కడకు స్పష్టముగా వినబడియెను. శాస్త్రి గుండెలు కొట్టుకొనసాగెను. ఇంతలో నొక వృద్ధాంగన రేవులో నుండి వచ్చి వెడలిపోయెను. శాస్త్రికి హృదయచలనము మఱింత యధికమయ్యెను. నరసమ్మ కన్నుల బడియెను. అప్రయత్నముగ నాతడు సన్నని యీలవేయగా పోవుచున్న నరసమ్మ తటాలున వచ్చి సావడిలోనికి బోయెను. శాస్త్రి పారవశ్యముతో లోపలకు బోయెను.

ఒక గడియ యుండి ఆమె మఱల కాల్వకు బోయి నీళ్ళు పోసుకొని వెడలిపోయెను. శాస్త్రి వండుకొని భుజించి నరసమ్మ సాహసమునకు ఆశ్చర్యపడసాగెను.

వారము దినములు గడిచినవి. చాలసేపు రహస్యముగ మాట్లాడి నాయనిని పంపివేసి శాస్త్రి శయనించెను. ఆయాలోచనమేదో యింకను శాస్త్రిని విడువలేదు. కల్పనల మీద కల్పనలు, ఊహలమీద ఊహలు, విఘాతములమీద విఘాతములు, ఉఱకలు వేసికొని వచ్చి పడిపోవుచుండెను. నిద్దుర రాలేదు. ఇటునటు దొరలుచు నాతడు ఉక్కిరిబిక్కిరి యగుచుండెను.

అర్ధరాత్రియాయెను. పొలములయందలి నక్కకూతలు గూడ నిలిచిపోయెను. జగమంతయు గాఢాంధకారమున మునిగి యుండెను. ఆసమయమున మాట్లాడకుండ నెవరో తలుపు గుంజిరి. శాస్త్రి యొకటి రెండుసారులు పలుకరించియు ప్రత్యుత్తరము గానక వచ్చి తలుపు తీయగా నొక వ్యక్తి తటాలున లోపల ప్రవేశించి తలుపులు వేసి శాస్త్రి చేయి పట్టుకొనియెను. ఆతడు నిర్విణ్ణుడై "ఏమిటిదీ?"అని యడుగగా "సాయంత్రం నేనిక్కడనుంచి వెడుతూ వుండగా చూసి మానాన్నతో యెవరో చెప్పేరుట. ఈరాత్రి మాకు కలహం జరిగింది. మానాన్న నన్ను కొట్టేడు. విషం పెట్టి చంపుతా నన్నాడు. చాలా హడావుడి చేశాడు. రెండుజాములరాత్రిదాకా మాకుతగువే. తిట్టితిట్టి మానాన్న నిద్రపోయాడు. ఎక్కడకేనా పోదాం పద" అని యావ్యక్తి చెప్పెను. శాస్త్రి ఒక్క నిముసము నిరుత్తరుడైయుండి "ఉండు. వస్తాను. లోపల తలుపు వేసుకో" అని చెప్పి వీథిలోనికి బోయెను.

మఱునాడు ఉదయము ఎనిమిదిగంటలవేళ నీలాటిరేవులో బ్రాహ్మణస్త్రీలు "పద్మనాభశాస్త్రులు గారి నరసమ్మ విశ్వనాథంతో లేచిపోయిందిటే?" అని దీర్ఘములు తీయుచూ చెప్పుకొనిరి.

## 7

ఊరంతయు అదే మాట. చాల గందరగోళముగా నుండెను. పద్మనాభశాస్త్రికి పిచ్చియెత్తినట్లయ్యెను. కాదా మఱి? ఏక పుత్రిక. కొడుకులు లేదు. వితంతువయినను ఇంత గంజి కాచిపోయుచున్నది. నాలుగేండ్లక్రిందట కళత్రవియోగ మయినపుడైన నాతడింతగదా విచారింపలేదు. కూతురు వ్యభిచరించి రంకుమగనితో లేచిపోవుటలో అరంకుమగడు విశ్వనాథశాస్త్రి యగుట ఆతనికి ప్రాణసంకటముగా నుండెను. తన శత్రువు తన కూతురికి ఉపపతి. పద్మనాభశాస్త్రి వంటి పట్టుదల గలవానికి ఇంతకంటె పరాభవము లేదు.

నలుగురును చేరిరి. కరణము కాగితములును కలమును చేతబట్టుకొని కూర్చుండెను. మునసబుగూడ వచ్చెను; గాని వ్రాతపని కరణముమీద పెట్టెను. ఆతడు సీతారామయ్యనాయని సాహాయ్యమును పొందుచుండెను.

రెండుగంటలు యోచించి గ్రామస్థుల సలహా పొంది పద్మనాభశాస్త్రి చెప్పగా నరసమ్మను విశ్వనాథశాస్త్రి వేయిరూపాయిల నగలతో లేవదీసికొని పోయెనని కరణము బకీరు వ్రాసెను. మునసబు తాను సంతకము చేయుటకు ముందు సాక్షులను ముదలకించి యడుగగా పద్మనాభశాస్త్రి "వాళ్ళకేమి భయమా? ఢంకామీద దెబ్బకొట్టి మఱీ చెబుతారు. చెప్పండిరా"యని సింహగర్జనము చేసెను. "అయితే చెప్పనక్కర్లేదు" అని బదులు చెప్పి మునసబు శాస్త్రి పలికిన మాటను క్రింద నుదహరించి పిదప సంతకము చేసెను.

కరణమును మునసబును కొంతతడవు రహస్యముగా సంభాషించుకొనిరి. మునసబు లొంగినట్లు కాన్పింపలేదు. కరణము వచ్చి "ముందు మునసబును మంచిమాటలాడుకోండి" అని చెప్పెను; గాని ఎవరును అందులకు పూనుకొనలేదు. బకీరు వెళ్ళిపోయినది.

ముందేమగునో. శాస్త్రికి భోజన మేదీ? జామున్నర ప్రొద్దెక్కిన తరువాత ఈ సంగతి జ్ఞాపకము వచ్చెను. ఆతడు బిందె పుచ్చుకొని స్వయముగ కాల్వకు బైలువెడగా ఇరుగుపొరుగున నున్న బంధువులు వారించిరి. భోజనానంతరము నలుగురైదుగురు యువకులు విశ్వనాథశాస్త్రిని, నరసమ్మను వెదకిపట్టుకొనుటకు బయలుదేరిరి.

# 8

వారము దినములు గడచిపోయినవి. కాకులు కూయుచుండగా రాజమండ్రి నుండి యొక పడవవచ్చి రేవులో నాగెను. సూర్యోదయమగునప్పటికి కాకినాడనుండి యొక మోటారు వచ్చి పడవవద్ద నిలిచెను. పడవలోనుండి పోలీసు డిప్యూటీ సూపరెంటు ఉద్యోగి వేషముతో దిగునప్పటికి నాయడు ఎదురువచ్చి నమస్కరించెను. ఆవెంటనే పోలీసు భటులు దిగిరి. ఇది యిట్లగుచుండగనే నాయని కమతములో పనిచేయుచున్నవారందఱును వచ్చి ముందు నిలిచిరి. నాయని గాదెలదొడ్డిలో నుండి బ్యాండువాద్యము వచ్చెను. దూదేకుల సాయిబు బాకానూదగా పడవలో నుండి విశ్వనాథశాస్త్రియు, నరసమ్మయు పెండ్లి కొడుకు, పెండ్లికూతుళ్ళ వేషములతోదిగి – మోటారెక్కిరి. పోలీసు అధికారి డ్రైవరు ప్రక్క గూర్చుండెను. రక్షకభటులు దారి తీయగా ఊరేగింపు బయలుదేఱెను. నాయని పెద్దపాలికాపు – విశ్వనాథశాస్త్రి వలన చిట్టచివర కాలువనుండి యుద్ధరింపబడిన పదునెనిమిదేండ్ల యువతి, భర్త మహోత్సాహముతో ముందు నిశానీ కొట్టుచుండెను.

క్షణములో ఈ సంగతి ఊరంతయు దెలిసెను. కన్నులుగలవారెల్లరును చూచి హృదయము గలవారెల్లరు నానందించిరి. అనేకు లాశ్చర్యపడిరి. చాలమంది బ్రాహ్మణులు తలుపులు బిగించుకొనిరి. పద్మనాభశాస్త్రి బ్రతికియుండియే చితిమీద దహనము చేయబడుచున్నట్లు అవస్థపడెను.

ఎవరికి దోచినట్లు వారు చెప్పుకొనిరి. పండ్రెండు గంటలవేళ పోలీసుడిప్యూటీ సూపరెంటు కచేరీసావడిలో విచారణ చేసి తప్పుడు బకీరు ఇప్పించినందులకు కేసు చేయబోవుచున్నట్లు పద్మనాభశాస్త్రితో టొకాయించి చెప్పెను. "నీకంటె నీకూతురు బుద్ధిమంతురాలు. ఆమెకి హృదయం వుంది. మానవజన్మకి అలంకారం అయిన ప్రణయం ఆమెలో నిండుగా వున్నది. ఇప్పటికైనా నువ్వు బుద్ధి తెచ్చుకోవడం మంచిది. అసూయవల్ల నువ్వు ఆబాలపండితుని వెలిపెడితే ప్రణయంవల్ల నీకూతురు ఆతణ్ణి గౌరవించింది. నువ్వు ఎవర్ని వెలిపెట్టేవో ఆతడు నీకు ఇప్పుడు అల్లుడు. జాగ్రత్త. ఆతనికి గాని నీకూతురికి గాని ఏమయినా ఆపత్తు వస్తే మీమెడలమీద తలలు వుండవు" అని గూడచెప్పి యాతడు సపరివారముగ వెడలిపోయెను.

వారము దినములయిన తరువాత నాయడు తల్లి యాజ్ఞచొప్పున తానిచ్చెదనన్న వేయిరూపాయలును గాక మఱికొంత ధనమును నూతనవస్త్రములును ఇచ్చి విశ్వనాథశాస్త్రిని, నరసమ్మను గుంటూరు పంపివేసెను.

❀ ❀ ❀